# "పారితోషికం"

— మల్లాది వెంకట కృష్ణమూర్తి

పదేళ్ళ క్రితం యిప్పు డున్నన్ని పత్రికలు లేవు. ఇప్పుడున్నంత మంది రచయితలూ లేరు. పత్రికలు పెరిగినట్లే చాలామంది రచయితలు అవాలనే కోరికని పెంపొందించుకుంటున్నారు.

ఇది మంచి మార్పే. కాని రచయిత అయేందుకు షార్టుకట్స్ అవలంబించడం మాత్రం అన్యాయం.

శశిధర్‌కి కూడా తానొక రచయిత నయి పోవాలని, నలుగురిలో తానొక రచయితగా గుర్తింప బడాలనీ కోరిక వుండటం సహజం. అనేక మంది రచనలు చదివి, 'రచనంటే ఓస్ ఇంతేనా' అనే నిర్ణయానికి వచ్చేసాడు.

నాలుగయిదు కథలు వ్రాసి పెద్ద పత్రికలకి పంపాడు. నాలుగయిదు నెలలు గడిచాయి. కాని ఇంకా అవి ప్రచురింపబడనూ లేదు, తిరిగి రానూ లేదు.

'చీకట్లో వెలగబోయే దీపంలాంటిది ఆశ — అని బహుశ ఆ పత్రికా సంపాదకులకి తెలిసి, కావాలని త్రిప్పి పంపడానికి ఆలస్యం చేస్తున్నారేమో?" అంటారు శశిధర్ మిత్రులు.

"బాగా రాసాను. మంచి బొమ్మతో, మధ్య పేజీల్లో రంగుల్లో వస్తుంది చూస్తూండండి" అంటాడు శశిధర్ వుత్సాహంగా.

ఓ ప్రముఖ వార పత్రికలో ఓ ప్రకటన చూసాడు శశిధర్ ఓ రోజు. డబ్బిచ్చి బయటవాళ్ళు ప్రకటించిన వాణిజ్య ప్రకటన కాదది. స్వయంగా ఆ పత్రికాసంపాదకులు, ఆ వార పత్రిక తరఫున వేసిన ప్రకటన.

దాన్ని ఉత్సాహంగా చదివాడు శశిధర్.

ఆ పత్రికలో సంక్రాంతి నుంచి కొత్త శీర్షిక ప్రవేశ పెడుతున్నారు. దాని పేరు 'మొగుడుతో కూడ చెప్పుకోలేని విషయం' ఈ శీర్షిక కింద. ఆంధ్ర దేశంలో ఆడవాళ్లు తమలో తాము మధన పడుతూ, ఇతరు లెవ్వరికీ చెప్పుకోలేని విషయాలని వ్యాసాలుగా వ్రాసి పంపితే ప్రచురిస్తామని, ప్రచురించిన వాటిలో ఉత్తమమయిన వ్యాసానికి నూట పదహారు పారితోషికం కూడా బహుమానం కింద యిస్తామని ప్రకటించారు.

తెలుగు నేల నాలుగు చెరగులనుంచీ వ్యాసాలు పుంఖాను పుంఖాలుగా ఆ వార పత్రిక కార్యాలయానికి రాసాగాయి. పరిశీలన కూడా ప్రారంభం అయింది. శశిధర్ కూడా ఆ అవకాశాన్ని వృధా పోనీయకుండా ఓ చక్కటి వ్యాసాన్ని వ్రాసి పంపాడు.

పంపబోయే ముందు చెల్లెళ్ళని, అక్కయ్యలని, పొరుగింటి వాళ్ళని సంప్రదించి, అనేక విషయాల గురించి సందేహ నివృత్తి చేసుకుని నాలుగ యిదు రోజులు కష్టపడి వ్రాసి, ఫేర్ కాపీ చేసి పంపాడు శశిధర్ అందరూ ఏకగ్రీవంగా బావుందని ఒప్పుకున్నాక.

ఆ వ్యాసం ఆ పత్రిక సంపాదక వర్గానికి కూడా వచ్చింది. న్యాయనిర్ణేత (త్రు ?) లకి కూడా బాగా నచ్చింది. దానికే ప్రథమ బహుమతి ఇవ్వబడింది.

ఆ వ్యాసం పేరు 'మూణ్ణాళ్ళముచ్చట' ఆడవాళ్ళు ప్రతి నెలలో మూడురోజులు తప్పని సరిగా విడిగా కూర్చోవలసిన వైనం, అప్పుడు వాళ్ళకి కలిగే చిరాకు, ఏం తోచక చదివిన పుస్తకాలే చదవాల్సి వచ్చేటప్పుడు కలిగే రోత మొదలయిన అనేక విషయాలు ఆవ్యాసం లోని ప్రధానాంశాలు.

పత్రికవాళ్ళు ముందరే తెలియ పరచడం వల్ల వాళ్ళు పంపే నూటపదహార్ల కోసం ఎదురు చూడసాగాడు శశిధర్, చెక్ వస్తుందా, మనిఆర్డర్ వస్తుందాఅని.

నూట పదహారు రూపాయలు వచ్చాయి.

చెక్ రూపంలో కాదు.

మనిఆర్డర్ రూపంలో అంతకంటే కాదు. ఓ పేకట్ రూపంలో వచ్చింది బహుమతి. అది విప్పితే,లోపల ఒక పసుపు పొట్లం. ఒక కుంకం పొట్లం, పత్రికా సంపాదకుల అభినందన లేఖతో పాటు ఓ చీర— 'కుమారి శశిధరికి' అని వ్రాసివుంది పైన.

ఆ డిసెంబర్ పూలరంగు చీర ఖరీదు సరిగా నూట పదహారు రూపాయలు!

('అనామిక' డిసెంబర్ 1974లో, హైద్రాబాద్‌లో, హోటల్ అన్నపూర్ణలో జరిపిన రచయితల గోష్ఠిలో, శ్రీ పన్యాల రంగనాథ రావుగారి వుపన్యాసం విన్న తర్వాత)

---

"మొదలఁ జూచినఁ గడు గొప్ప ♦ పిదపఁ గురుచ
యాదిఁ గొంచెము తర్వాత నధిక ♦ మగుచుఁ
దనరు దినపూర్వపరభాగ ♦ జనితమైన
చాయపోలికఁ గుజన ♦ సజ్జనులమైత్రి"

---